క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మురుగు కాల్వల్లోని మురుగు తొలగించే పనులు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతామన్నారు. అందుకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఆయన వెంట శానిటరీ అధికారి శ్రీనివాస్, వార్డు అధికారులు ఉన్నారు.

35 మంది పిల్లలకు అడ్మిషన్



స్పోర్ట్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

రాయికోడ్(అందోల్): బడిబాట కార్యక్రమంలో 35 మంది పిల్లలను బడిలో చేర్పించినట్లు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాయికోడ్ బడిబాట కార్యక్రమం చివరి రోజున స్పోర్ట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల ఆటలు ఆడించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తమ విద్యార్థులకు బోధన అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదవులు, తులసి, శోభతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చెరువుకబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నర్సింహారెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి పెద్ద చెరువు కబ్జాపై కలెక్టర్ ఎం.ప్రావీణ్యకు గురువారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రాంరెడ్డిపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్‌ను మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెరువు కబ్జా చేసిన వ్యక్తి, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ భూమిని కాపాడండి



వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్‌లోని రామలింగేశ్వర ఆలయ భూమిని పరిరక్షించాలని కోరుతూ కమిటీ సభ్యులు, గ్రామస్తులు గురువారం ఆర్డీఓ కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలోని 66 సర్వే నంబర్‌లో 2.12 గుంటల భూమిలో స్వామి ఆలయం ఉంది. 40 సర్వే నంబర్‌లో 31 గుంటల భూమి మందిరం అభివృద్ధి కోసం కేటాయించారు. ఆలయానికి చెందిన భూమిని పూజారులు రికార్డులు తమ పేరున మార్చుకుని అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆలయ భూమిని కాపాడాలని కోరారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

కొండాపూర్(సంగారెడ్డి): గుండెపోటుతో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని మారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండలం కలబ్‌గూరుకు చెందిన మధుసూదన్ 2018 నుంచి మారేపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం పాఠశాలకు వచ్చి, విద్యార్థులకు పాఠాలు బోధించాడు. తరగతి గది నుంచి బయటకు వస్తూ పాఠశాల ఆవరణలోనే ఒక్కసారిగా కుప్పకూలాడు. ఉపాధ్యాయులు తక్షణమే సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినప్పటికీ మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాపై పెరుగుతున్న అవగాహన
- జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన భారత్



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

ఎలాంటి అనారోగ్య సమస్యనైనా దూరం చేసే శక్తి యోగాకు ఉందనడంలో అతిశయోక్తి లేదు.. ప్రతి రోజు నిత్యం గంటపాటు యోగాభ్యాసం చేస్తే మనిషికి రోగనిరోధక శక్తి మెరుగవుతుందని వైద్యానిపుణులు అంటున్నారు.

సంగారెడ్డి క్రైమ్: ప్రపంచవ్యాప్తంగా యోగాకు విశేష ఆదరణ ఉంది. పురాణాలు, వేదకాలం నుంచే యోగా ప్రచుర్యంలో ఉంది. యోగా మనిషి ఒత్తిడిని తగ్గించడం, శరీరక బలాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆధునిక జీవన విధానంలో మారుతున్న ఆరోగ్య అలవాట్లు, పెరుగుతున్న మానసిక ఒత్తిడిల వల్ల చాలా మంది ఆనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. క్రమం తప్పకుండా యోగా చేస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. యోగా అనేది ఓ దివ్య ఔషధం అని గుర్తించుకోవాలి. అటు విద్యార్థులు, నిరుద్యోగులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారు.

యోగా చేయడం వల్ల ఎలాంటి చికిత్స లేకుండానే ఆరోగ్యం బాగుపడుతుందని ప్రముఖులు అంటున్నారు. ప్రతిరోజు గంటపాటు యోగా చేయడం అందరికి ఉత్తమం.



సంగారెడ్డి యోగా భవన్‌లో ధ్యానం చేస్తున్న యువకులు

యోగా నేపథ్యం

ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. దీనికి 2014 సెప్టెంబర్ 27న భారత ప్రధానిగా నరేంద్ర మోడీ ఐక్యరాజ్యసమితి (ఐరాస)సార్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిపేందుకు ప్రతిపాదన చేశారు. 193 ఐక్యరాజ్య సమితి ప్రతినిధుల్లో 175 మంది ప్రతినిధులు మద్దతు ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి భద్రత మండలిలో శాశ్వత సభ్యులుగా ఉన్న ,రష్యా ,అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాలు సహా ఈ తీర్మానంపై విస్తృతమైన చర్చల తర్వాత 2014 డిసెంబర్ నెలల్లో ఆమోదించాయి. 2015 జూన్ 21న మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.

సంగారెడ్డి యోగా భవన్

జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోని యోగా భవన్ జిల్లా వ్యాప్తంగా గుర్తింపు పొందింది. అనేకమంది గురువులు యోగా పోటీల్లో రాణించడంతో పాటు అనేక మందికి యోగాలు నేర్పుతున్నారు. ప్రజల్లో యోగాపై అవగాహన పెరుగుతుండటంతో నిత్యం యోగా సాధనకు వృద్ధులు, విద్యార్థులు, యువకులు ఆచరిస్తున్నారు.

ఒత్తిడి దూరం



ప్రతిరోజు యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటాం. నిత్యం బిజీగా ఉండేవారు క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే ఒత్తిడిని జయించి ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతున్నారు. ప్రతిరోజు ఉదయం అరగంట పాటు యోగాకు సమయం కేటాయిస్తే చిన్నచిన్న వ్యాధులకు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

– వరహరి, యోగా సాధకుడు

యోగా సాధనతో విజయం

కొన్ని ఏళ్లుగా పాఠశాలల్లోని విద్యార్థులకు యోగాల్లో శిక్షణ ఇస్తున్నాం. యోగా సాధనలో ఆహార నియమావళి ముఖ్యమే. విద్యార్థిని విద్యార్థులకు శారీరకంగా మానసికంగా సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. విద్యార్థులకు తమ లక్ష్యసాధనలో ముందుకు సాగే క్రమంలో ఆటంకాలు సహజం. విద్యార్థులు పరీక్షల సమయంలో యోగా సాధనతో ఒత్తిడిని జయించి, విజయాని అధిగమించడం సాధ్యమవుతుంది.

– శోభారాణి, ప్రిన్సిపాల్, సంగారెడ్డి

ఉపాధిహామీ పనులపై అవగాహన

ఎంపీడీఓ శ్రీనివాస్

కంది(సంగారెడ్డి): జాతీయ ఉపాధి హామీ పథకంలో కొత్తగా ప్రవేశపెట్టిన పనులపై రైతులకు సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. గురువారం కందిలో ఉపాధిహామీ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై సిబ్బందికి శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు నాలుగు నెలల నుంచి రూ. 307లు చెల్లించనున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు చెరువులు కుంటలు, కాలువల పూడికతీత వంటి పనులను మాత్రమే చేపట్టడం జరిగింది. ఇప్పటి నుంచి రైతులకు లబ్ధిచేకూర్చే పశువుల పాకలు, పండ్ల తోటల పెంపకం, పందిరి సాగు వంటి వాటిపై ఉపాధి హామీ ద్వారా కూలీలతో పనులు చేయించవచ్చన్నారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు రైతులతో మాట్లాడి గ్రామాల్లో చేపట్టవలసిన పనులపై ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఏపీఓ గురుపాదంతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఉపాధిపనులపై శిక్షణ కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

ప్లాస్టిక్‌ను నివారిద్దాం

మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం వెజిటేబుల్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన బయోడిగ్రేబుల్ కవర్స్ స్టాళ్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి సందర్శించి వ్యాపారులకు, కొనుగోలుదారులకు బయోడిగ్రేబుల్ కవర్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పర్యావరణానికి నష్టం కలిగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని సూచించారు. ప్లాస్టిక్ నిషేధ చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బయోడిగ్రేబుల్ కవర్స్ వాడటం వల్ల తేలికగా మట్టి, వాటర్‌లో కూడా కరిగిపోతుందని స్థానికులకు వివరించారు. అనంతరం 6 వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని రూ.5000 జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్వో నర్సింలు, ఏఈ కిష్టయ్య, వార్డు ఆఫీసర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పంచాలి

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ భూమిని నిరుపేద కూలీలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి వెంకట్ కోరారు. ఆయన మాట్లాడుతూ.. కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లిలో 102, 103 సర్వే నంబర్‌లో 70 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు కొంతమంది ఆ భూమిని అక్రమించుకుని సాగు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. కబ్జాదారుల నుంచి భూమిని తీసుకుని పేదలకు పంచాలని విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు వేగంగా నిర్మించాలి



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చలపతిరావు

హౌసింగ్ పీడీ చలపతిరావు

వట్‌పల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్లు వేగంగా నిర్మించాలని హౌసింగ్ పీడీ చలపతిరావు అన్నారు. గురువారం వట్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, బిల్లులు చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16,559 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. 14449 ఇళ్ల నిర్మాణాలకు మంజూరు పత్రాలు అందజేశామన్నారు. వీటిలో 3685 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాగా 200 ఇళ్లు బెస్మెంట్ స్థాయిలో, 35 ఇళ్లు గోడల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇళ్ల బిల్లుల చెల్లింపులు లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మ్యాపింగ్ ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణాలు చేపట్టిన వారికి 4 విడతలుగా రూ. 5 లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. నిర్మాణ పనులు చేపట్టిన వారికి విడతల వారీగా సహాయం అందుతుందని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలలో సమస్యలు తలెత్తితే అధికారులను సంప్రదించాలన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే నేరుగా ప్రాజెక్టు డైరెక్టర్, హౌసింగ్ కార్పొరేషన్‌కు ఫిర్యాదు చేయొచ్చని వివరించారు. ఆయన వెంట నారాయణఖేడ్ డీఈ సతీష్ తివారీ, ఎంపీడీఓ అంజయ్య, హౌసింగ్ ఏఈ శివాని తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి ఎఫెక్ట్..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలోని విద్యార్థులు స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌లు రాక ఇబ్బందులు పడుతుంటే ఈసమస్య సాక్షి దినపత్రికలో ఈనెల 18వ తేదీన‘అడ్మిషన్ ఇవ్వండి మహాప్రభో..’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. గురువారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ కేసీఆర్ నగర్‌ను సందర్శించారు. కేసీఆర్‌నగర్‌లో ఉన్నత పాఠశాల ఏర్పాటు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను తక్షణం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. త్వరలో ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. డిగ్నిటీ కాలనీలో నూతనంగా ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేస్తున్నాట్లు తెలిపారు. కేసీఆర్ కాలనీలో ఎంత మంది విద్యా



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ ప్రజాపాలనలో ప్రజావ్యతిరేక చర్యలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 135వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లిలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో స్థానిక మహిళలు పాల్గొని సంఘీభావం తెలిపారు. గత నాలుగు నెలలుగా డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా శాంతియుతంగా చేపడుతున్న నిరసనలకు ప్రభుత్వం స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో వ్యవసాయ ఆధారిత గ్రామాల్లోని చెరువులు, కుంటలతోపాటు ప్రకృతికి విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

◆ దాతల సహకారం అభినందనీయం

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓ మాణెయ్య అన్నారు. మండలంలోని కల్బరల్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు యశోదా హాస్పిటల్ డాక్టర్ పి.అభినందన్‌రెడ్డి స్పోర్ట్స్ యూనిఫాంలు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు స్కూల్ బ్యాగులు, ఐడీ కార్డులు అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ.. 90 మంది విద్యార్థులకు రూ. లక్ష విలువ చేసే వస్తువులను అందజేయడం సంతోషకరమన్నారు.

◆ ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

నారాయణఖేడ్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపి ప్రపంచ శాంతిని కాపాడాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సాయిలు తెలిపారు. గురువారం ఖేడ్‌లో పార్టీ నాయకులతో కలిసి పాలస్తీనాకు సంఘిభావంగా, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

◆ హుండీ లెక్కింపు

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలోని సిద్దేశ్వర స్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ ఈఓ శివరుద్రప్ప తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, పూజారి సంగమేశ్వర స్వామి, పెద్దలు నర్సింలు, గాల్‌రెడ్డి, శేఖర్ పాటిల్, పోలీసు సిబ్బంది సమక్షంలో హుండీని లెక్కించామన్నారు. ఆలయం హుండీ రూ.65,760 వచ్చిందన్నారు.

బ్యాంకుల వద్ద రైతుల సందడి

రైతు భరోసా నిధులు విడుదల

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేస్తుండటంతో డబ్బులు డ్రా చేసుకునేందుకు రైతులు బ్యాంక్‌ల వద్దకు వస్తున్నారు. దీంతో బ్యాంక్‌ల వద్ద సందడి నెలకుంది. తొమ్మిది రోజుల్లో అందరి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని సీఎం ప్రకటించి ప్రారంభించారు. గురువారం వరకు ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున బ్యాంక్ ఖాతాలో నిధులు జమ అయ్యాయి. ఈ మేరకు ఫోన్‌లకు మెసేజ్‌లు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి నాలుగు ఎకరాలకు మించి భూమి ఉన్న రైతులకు ఇప్పటివరకు నిధులు జమకాలేదు. అయితే వానాకాలం సీజన్‌కు మాత్రం వేగంగా రైతు భరోసా నిధులు జమ అవుతున్నాయి. జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, మొగుడంపల్లి, ఝరాసంగం మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో పెద్ద రైతులు 9618, సన్నకారు రైతులు 41,976, చిన్నకారు రైతు లు 20,786 మంది ఉన్నారు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న సమయంలో బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ అవుతుండడంతో పెట్టుబడి కోసం డబ్బులు డ్రా చేసుకుంటున్నారు. దీంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బ్యాంకుల వద్ద రైతుల సందడి నెలకొంది.



మల్‌చెల్మలోని బ్యాంక్ వద్ద రైతులు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీఓ అనిత

డీఎల్పీఓ అనిత

వట్‌పల్లి(అందోల్): వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎల్పీఓ అనిత ఆదేశించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమలు, ఈగలు వృద్ధి చెంది విషజ్వరాలు సంక్రమించే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వారానికి ఒక రోజు మంచినీటి ట్యాంకులు, మురికి కాలువలను శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు. కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారికి అనుమతులు, లేఅవుట్ విషయంలోనూ తగు జాగ్రత్తలు తీసుకొని అనుమతులు ఇవ్వాలని సూచించారు. అనుమతుల కోసం డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజయ్య, ఎంపీఓ నాసిరోద్దీన్, సీనియర్ అసిస్టెంట్ దశరథ్, రమేష్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూనెగింజల సాగుకు ప్రోత్సాహం

- సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఏడీఏ భిక్షపతి
- రైతులకు ఉచితంగా సోయాబీన్ విత్తనాల పంపిణీ

జహీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఉచితంగా సోయాబీన్ విత్తనాలను పంపిణీ చేస్తోందని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఏడీఏ భిక్షపతి అన్నారు. గురువారం వ్యవసాయశాఖ, నారింజ రైతుమిత్ర ప్రొడ్యూసర్ సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఐదు గ్రామాల రైతులకు సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాడకానికి తగినట్లుగా నూనెగింజలు పండించడం లేదన్నారు. నూనెలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. దీనిని అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూనెగింజల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. అందులో భాగంగానే సోయాబీన్ విత్తనాల పంపిణీ పథకం తీసుకోవచ్చిందన్నారు. సంగారెడ్డి జిల్లాలో వేయి హెక్టార్లలో నూనెగింజలను పండించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. జహీరాబాద్ డివిజన్‌లో 500 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. నాణ్యవంతమైన కొత్తరకాన్ని అందజేయడం జరుగుతోందన్నారు. కోహీర్ మండలంలోని దిగ్వాల్, గురుజువాడ, మదిరి, గొటిగార్‌పల్లి, మొగుడంపల్లి మండలంలోని గొటిగార్‌పల్లి గ్రామాల రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ నవీన్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త స్నేహలత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కేతకీ చైర్మన్ శేఖర్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రావుపాటిల్, నారింజ ప్రొడ్యూసర్ సంస్థ సీఈఓ సప్రసితరెడ్డి, డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న గిరిధర్‌రెడ్డి, ఏడీఏ భిక్షపతి తదితరులు

పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా చదువుతున్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఏఓకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ విద్యార్థులు 19 వేలు, ఎస్టీ విద్యార్థులు 6 వేల మంది వివిధ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారన్నారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కావడం లేదన్నారు. దీంతో దళిత, గిరిజన విద్యార్థుల విద్యకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని వాపోయారు. రూ.154 కోట్ల బకాయిలు చెల్లించాలని తెలిపారు. యాజమాన్యాలు విద్యార్థులను పాఠశాలలకు రానివ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ సంఘాల జిల్లా కార్యదర్శులు, రాజేష్, అనిల్, అశోక్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి అర్జున్, కేవీపీఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బొల్లారం కాలుష్యంపై విచారణ

జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమలు వెదజల్లుతున్న రసాయన వ్యర్థాలపై ఫిర్యాదులకు రాష్ట్ర పీసీబీ కార్యాలయం అధికారులు స్పందించినట్లు ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. కొంతకాలంగా బొల్లారం పారిశ్రామికవాడలోని గ్లోకెం, బాలాజీ ఎమ్మెన్స్, శ్రీకృష్ణ కెమికల్స్, అమరావతి, సాయిల్యాబ్, ఎంఎస్ లేబరేటరీస్, స్నేహ ఫార్ములా పరిశ్రమలు చెరువులు, కుంటలనే కాకుండా భూగర్భ జలాలను సైతం రసాయన వ్యర్థాలతో కలుషితం చేస్తున్నారని నగరంలోని పీసీబీ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులకు స్పందించిన రాష్ట్ర పీసీబీ సెక్రటరీ గోగులోతు రవి ఆదేశాలతో రామచంద్రపురం పీసీబీ ఈఈ కుమార్ పాఠక్ అధ్యక్షతన రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారని అన్నారు. ప్రత్యేక బృందాలు బొల్లారం పారిశ్రామిక వాడలోని ఆసానికుంటలోని జలాలు, ఇళ్లల్లో ఏర్పాటు చేసిన బోరు నీటిని శాంపిల్స్ సేకరించారు. గురువారం పీసీబీ రాష్ట్ర కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆదేశాలు అందాయి. విచారణలో బొల్లారంలో పరిశ్రమల రసాయన, వాయు కాలుష్యంతో ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించినట్లు తెలిపారు.



ఆసాని కుంటలో శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

గంజాయి స్వాధీనం

మునిపల్లి(అందోల్): 450 గ్రాముల గంజాయి, 5,450 లీటర్ల గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, సీఐ శంకర్ తెలిపారు. గురువారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇంద్రేశం, పటాన్‌చెరుకు చెందిన కంచె రాకేశ్ 450 గ్రాముల ఎండు గంజాయిని తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే, కంకోల్ టోల్‌ప్లాజా సమీపంలో వివిధ రకాల బ్రాండ్లకు చెందిన 5,450 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు హనుమంతు, సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు అదుపులో నిందితుడు